
కథ



# ఛీ! నాన్న పెళ్లి చేసుకొన్నాడా?

## (సింగారం-బంగారం అను ఇండో-అమెరికన్ కథ)

చేగొండి రామజోగయ్య

(గత సంచిక తరువాయి)

ఛీ! షిట్! నేనెప్పుడైనా ఆయన్ని పెళ్లి చేసుకోవద్దు అని బతిమాలుకొన్నానా? ఎప్పుడో చేసుకోవాల్సింది. పోనీ ఇప్పుడైనా ఒక్కగానొక్క కూతురికి మాటైనా చెప్పకుండా,... ఛ ఛ! పోనీ, ఈడూ-జోడూ కూడా చూసుకోకుండా, అంత చిన్న వయసుదాన్ని పెళ్లి చేసుకొని గొంతు కోయడానికి మనసెలా వచ్చింది? ఛీ ఛీ!

భర్తతో కూడా తన బాధ పంచుకోలేక, వారం రోజులు అతిభారంగా గడిపేసింది అనిత. ఇండియాలో ఇంకెవరికీ ఫోను చేసి మాట్లాడ టానికీ సాహసించలేదు. ఎవరే విధంగా మాట్లాడుతారో తనింకా 'షేమ్' ఫీలవవలసివస్తుందేమోనని భయపడి.

ఈ ఆదివారం కూడా ఎవరికి ఫోను చేయలేదు. మధ్యలో ఒకసారి అనంత్‌కి అనిపించింది, మౌనంగా బాధపడుతూ, కుమిలిపోతున్న భార్యను చూసి-ఓ సారి మావయ్యగారితో తనని మాట్లాడిస్తే మంచిదని, వెంటనే భార్యకు చెప్పకుండా మావగారింటికి, ఫోను కలిపేడు. నల్లబడిన ముఖంతో రిసీవరు భార్యకందించాడు, 'ఏదో మెసేజ్ ఉంది వినలేదా?' అంటూ.

అప్పుడు అనితకు జ్ఞాపకమొచ్చింది-గత ఆదివారం ఫోను ఆన్సరింగు మెషిన్‌లో నాన్న పెట్టిన మెసేజ్ తను సరిగా వినలేదని... ఎంతో ఉత్సాహంగా ఎన్నో చెప్దామని ఫోన్ చేస్తే, ఆయన ఇంట్లో ఉండకుండాపోయేడన్న ఉక్రోషం వచ్చి, ఫోను పెట్టేశానని. సరే, ఇప్పుడు సరిగా విందామని, రిసీవరు చెవి దగ్గర పెట్టుకొని ఆలకించింది. అంతే, ఇంకా వొళ్లు మండి పోయింది! ఇదే మెసేజ్.

'నేను ఇంట్లో లేను, పిన్నీ, నేనూ కలిసి యాత్రలకువెళ్తున్నాం-వచ్చే శనివారం రాత్రికి తిరిగి వస్తాం. నువ్వు మామూలు టైముకి వచ్చే ఆదివారం ఫోను చేయి."

మొదటిసారి విన్నప్పుడు పిన్ని ప్రస్తావన పట్టించుకోలేదు. 'ఇంట్లో లేను' అన్నంతవరకు విని, దభేల్మని ఫోను పెట్టేసింది నిరుత్సాహం ముంచుకొచ్చి-అప్పటికి, అనంత్ పెళ్లి ఫోటో ప్రింటవుట్, తీసుకొచ్చి చూపించలేదు ఇప్పుడు మెసేజ్ అంతా, పిన్ని ప్రస్తావనతో సహా వినేసరికి బాగా వొళ్లు మండిపోయింది అనితకి.

ఛీ...షిట్.. పిన్ని అని చెప్తున్నాడు సిగ్గు లేకుండా! యాత్రలకట... యాత్రలు! పడుచు పెళ్లాంతో హనీమూన్‌కి చెక్కేస్తున్నాని చెప్ప డానికి మొహమాటం అడ్డువచ్చింది కాబోలు-యాత్రలకెళ్తున్నా నని చెప్తున్నాడు. మళ్లీ పెళ్లి చేసుకొన్నానని డైరెక్టుగా చెప్పడానికి సిగ్గు-అడ్డువచ్చింది కాబోలు, మాయదారి సిగ్గు! అరవై మూడేళ్ల వయసులో మళ్లీ పెళ్లిచేసుకోవడానికి మాత్రం ఈ సిగ్గు అడ్డు రాలే దా? అని ఇంకా ఉక్రోషపడిపోయింది.

పోనీ ఈ మెసేజ్‌లోనైనా 'ఏం అనుకోకురా, అమ్మాయ్! నీకు ముందు చెప్పలేదని కోపగించుకోకు-ఏదో అలా జరిగిపోయింది. ఈవిణ్ని మన కుటుంబంలోని వ్యక్తిగా అంగీకరించు, ఆదరించు తల్లీ!' అని చెప్పివుంటే, తను కూడా కరిగిపోయేది కాదా? అని పదేపదే అనుకొంది అనిత.

ఇప్పుడీవిణ్ని 'మా పిన్ని' అని ఎలా చెప్పుకోవాలి? మా నాన్న ఈ వయసులో ముచ్చటపడి ఇంత చిన్నవయసు అమ్మాయిని పెళ్లి చేసుకొని గొప్ప నిర్వాకం చేసేడని ఎలా చెప్పుకోవాలి? ఇన్నాళ్లూ మానాన్న ఎంతో త్యాగమూర్తి అని గొప్పగా చెప్పుకొనేదే! గొప్ప ఋషిలాంటివాడని డబ్బా కొట్టేదే! ఇప్పుడెలా? ఇలా ఎంతో మథన పడిపోయింది ఈ వారమంతా అనిత.

ఇంకో కోణంలో ఆలోచించి సమాధానపడటానికి అప్పుడప్పుడు ప్రయత్నించకపోలేదు. పోన్లే... ఇక్కడ అమెరికాలో వయసు మీరిన వాళ్లు పెళ్లి చేసుకోరా! నాన్నా అదే పని చేసేడు-అని తనకు తానే నచ్చజెప్పుకోబోయింది.

కాని వెంటనే 'ఈయన వయసు అరవై మూడు. పాపం, ఆ అమ్మాయి వయసు ఇరవై... పోనీ, పాతిక.. రామ రామ!' అన్న

భావం మనసున చెళ్లున కొట్టింది.

అప్పుడు, తనూ అనంత్, ఈ మధ్యనే ఒక 'గెట్ టుగెదర్' పార్టీలో ఇతరప్రవాసభారతీయమిత్రులతో చెప్పుకొని పడీపడీ నవ్వుకొన్న విషయం గుర్తుకొచ్చింది.

'జాన్, అనంత్ బాస్. వయసు అరవై. ఈ మధ్యనే-యాభై అయిదేళ్ల పెళ్లాం 'జానీ'కి విడాకులిచ్చేసేడు. వీళ్లిద్దరికి పుట్టిన పుత్ర రత్నం పేరు బాన్. వయసు పాతిక. ఇప్పుడు ముగ్గురూ విడివిడి గానే ఉంటున్నారు. మదర్స్ డే నాడో-ఫాదర్స్ డే నాడో జ్ఞాపకం లేదు గాని, ఒక రెస్టారెంటులో కలుసుకొన్నారు. ఈ మధ్యనే ముందే చెప్పుకొని. అయితే, ఈ మీటింగుకి తమ తమ 'ప్రస్తుత పార్టనర్సు'ని కూడా తీసుకొనివచ్చేరు. మరి 'పార్టనర్సు' అంటే ఏదో వ్యాపారంలో భాగస్వాములని అర్థం కాదు. కొన్నాళ్లు ప్రయోగాత్మకంగా కలిసి ఉండి సంతృప్తి చెందిన తర్వాతే చర్చిలో 'అఫీషియల్'గా దాంపత్యభాగస్వాములై, వయసు పట్టింపు లేకుండా, మోజు పడి పెళ్లి చేసుకొన్నవాళ్లన్నమాట!

జాన్‌గారి ప్రస్తుతభార్య వయసు పాతిక. ఆయన మాజీ భార్య జానీమేడమ్ గారి ప్రస్తుతభర్తవయసు ముప్పై. మరైతే, జాన్, జానీ గార్ల గతదాంపత్యఫలం బాన్‌గాడు ఏరి కోరి చేసుకొన్న మేడమ్ వయసు యాభై పైనే. అంటే దాదాపుగా, అత్తమామల వరస అయే జాన్-జానీలకు సమవయస్కురాలు. మరి ఈ మూడు జంటలూవ ఎరింట్లోనూ కాకుండా, ఒక పబ్లిక్ ప్లేస్‌లో ఏదో రెస్టారెంటులో కలుసుకున్నారన్నమాట. పాతికేళ్ల బాన్, తన తండ్రి ప్రస్తుతభార్య తన వయస్సే అయినదాన్ని మమ్మీ అనో ఆంటీ అనో ఎలా పిలవగలడు? అలానే తన తల్లి ప్రస్తుతభర్త వయసు ముప్పై మాత్రమే కదా, అతగాణ్ని ఏమని పిలవాలి? అలానే జాన్‌గారు గాని, జానీగారు గాని, తమ కొడుకు ప్రస్తుతభార్యను యాభై ఏళ్ల దాన్ని 'కోడలు పిల్లా' అని పిలవగలరా? 'జాన్' గారి ప్రస్తుతభార్య, ఆయన మాజీభార్య, జానీగారి ప్రస్తుతభర్త అంత చిన్న వయసు వాళ్లు, మిగిలినవాళ్లతో ఎలా వరసలు కలపాలి? అయితే అమెరికన్ సమాజంలో దీనికి చక్కని పరిష్కారముంది. వాళ్లు తమ మాజీ కుటుంబీకుల్ని ఏ వరసలు లేకుండా, మిస్టర్ ఫలానా అని, మిసెస్ ఫలానా అని మాత్రమే పిలుచుకొని, వరసలతో సంబంధం లేకుండా ఆ కాసేపూ గడిపేసి, కలిసి కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకొని, వాతావరణం గురించి చెప్పుకొని, తిని తాగేసి, ఎవరి దారిన వాళ్లు 'బై' చెప్పుకొని వెళ్లిపోతారు. అంటే మిస్టర్ జాన్, మిసెస్ జాన్, మిస్టర్ బాన్, మిసెస్ బాన్ అని సంబోధించుకొంటారన్నమాట. అంతే గాని, డాడీ, మమ్మీ, ఆంటీ, అంకుల్ అన్న వరసలు పట్టుకొని వేలాడరు.

ఇదంతా చెప్పుకొని, పడీ పడీ నవ్విన తామే, నాన్న చేసుకొన్న 'మళ్లీ పెళ్లి' వలన నగుబాటు అయ్యామే అన్న భావం, అనితను ఎంతో వేధించసాగింది. కలతకు గురిచేసింది ఈ వారం రోజులూను.

అలా ఈ వారమంతా, అనిత, తన తండ్రి పట్లా, ఆయన పెళ్లి పట్లా, నెగెటివ్ ఆలోచనలలోనే గడిపింది. ఎన్ని కోణాల్లో ఆలోచించినా, ఈ వయసులో నాన్న పునర్వివాహం చేసుకోవడాన్ని, ఏ మాత్రం స్వాగతించలేకపోయింది. అందుకే నాన్న 'యాత్రల' నుండి తిరిగి వచ్చేసి ఉంటారని తెలిసినా, రివాజు ప్రకారం, ఈ ఆదివారం ఫోను కలపడానికి సిద్ధపడలేకపోతున్నది.

అయితే, ఇంతలో ఫోను మోగింది. మోగుతూనే ఉంది. అది నాన్న నుంచేనని అనిత సిక్త్ సెన్సు చెప్తోంది. కూతురు ఫోను చేయలేదని, బజార్లోకి వచ్చి ఐఎస్‌డి చేసేడని అనిపించింది. వణుకుతున్న చేతులతో, వద్దనుకొంటూనే ఫోను ఎత్తింది.

"అమ్మాయ్! ఇంట్లోనే ఉన్నారా ఈ వీకెండ్? మరి ఏంట్రా నాకు ఫోను చేయలేదు చెప్పరా తల్లీ! అంతా బాగున్నారా?" నాన్న గొంతులోని ఆదుర్దా మనసుని తాకింది. అయినా "ఆ..." అని పొడిగా జవాబిచ్చింది.

"అబ్బాయి ఇంట్లోనే ఉన్నాడా? .అనంత్?" అన్న ప్రశ్న కీ, "ఊ..." అనే పొడిగా జవాబిచ్చింది.

"ఏమన్నా ప్రోబ్లెమ్ ఉంటే చెప్పమ్మా."

"నాకు ప్రోబ్లెం ఉంటే నీకేం బాధ ఇప్పుడు...?" అని మాత్రం అనకుండా ఉండలేకపోయింది. మరి ఉక్రోషం ఎంతసేపు ఆపుకోగలదు? 'నా సంసారం వేరు నీ సంసారం వేరు ఇప్పుడు' అని కసిగా లోపలే అనుకొంది, పైకనలేదు.

"ఏమే? ఏమిటి సంగతి? సరిగ్గా చెప్పి ఏడు!" ఈ సారి ముసలాయన గదమాయించేసరికి, ఆయన కూతురే కదా, అనితకూ తిక్క రేగింది బాగా. "హనీమూన్ బాగా జరిగిందా?" కసిగా అడిగేసింది.

అవతల కాసేపు నిశ్శబ్దం.

దాంతో ఇంకా రెచ్చిపోయింది. 'ముందు చెప్తే అడ్డు తగులుతానను కొన్నావా? నీ మళ్లీ పెళ్లి జరగనివ్వననుకొన్నావా? నేనింత పరాయి దాన్నయిపోయానా?" వారం రోజుల నుండీ పేరుకుపోయిన, కోపం, ఉక్రోషం ఒక్కసారిగా బయటికి వచ్చేశాయి, అప్రయత్నంగా.

అట్నుంచీ ఇంకా ఉలుకూ పలుకూ లేవు.

'ఏం, మాట్లాడవేం?' ఈ సారి గదమాయించింది పెంకిగా.

"పెళ్లి? ఎవరి పెళ్లి గురించి...?"

"ఇంకెవరి పెళ్లి...? నీ పెళ్లే.. నీ పెళ్లే...! నీ మళ్లీ పెళ్లి గురించే మాట్లాడుతున్నాను. నీ పెళ్లి ఫోటో పేపర్లో... అదే ఇంటర్నెట్లో చూసేను. అంత చిన్న వయసుదాన్ని చేసుకోవడానికి మనసెలా ఒప్పింది?" ఇంత వరకు వచ్చేక, దులిపేయాల్సిందే అనుకొంది రోషం ఆపుకోలేక.

"నా మెళ్లో దండ వేస్తున్న గాయత్రి ఫోటో చూసినట్టున్నావు" సంశయంగానే అడిగేడు నాయుడుగారు, కూతుర్ని.

"ఔను!" నిశ్చయంగా జవాబిచ్చింది. ఆవిడ పేరు గాయత్రా అని లోపలే అనుకొంటూ. ఇంకా దాగుడుమూతలెందుకో అర్థం కాలేదు.

"చూడు తల్లీ. గాయత్రి నా ఓల్డ్ స్టూడెంటు .నేనంటే తనకి ఎంతో భక్తి. పిచ్చిపిల్ల... ఈ మధ్యన, గాయత్రి కవిత్వం రాస్తోంది. ఒక సంకలనం ప్రచురించి, నాకు అంకితమిచ్చింది. గ్రాండ్‌గా సభ జరిపించింది. ఆ సందర్భంలో తండ్రి లాంటి నా మెళ్లో దండ వేసింది...ఆ ఫోటో చూసి కాబోలు, నువ్వు పెళ్లి ఫోటో అనుకొన్నావు! ...నాన్న ఈ వయసులో 'మళ్లీ పెళ్లి' చేసుకొన్నాడని అనుకోవడం అబ్బెబ్బే...' శాంతంగానే అన్నా, ఆయన గొంతులో అవధుల్లేని ఆవేదన సుళ్లు తిరిగింది.

అనిత గుండెల్లో గునపాలు దిగినట్లయింది.

"అయితే అది పెళ్లి ఫోటో కాదా? మరైతే ఆ ఫోటో కింద భర్త సింగారం నాయుడు అని ఉందేమిటి?' ఎలాగో నోరు పెగుల్చుకొని అడగగలిగింది.

"నా బొంద!! ఎంత మొత్తుకొన్నా, ఇంగ్లీషు మీడియంలో మునిగిపోయి తెలుగు సరిగా నేర్చుకోలేదు, నువ్వు కర్మ! ఆ ఫోటో కింద ఏం రాసివుందో సరిగా చూసినట్టు లేదు. కృతి భర్త సింగారం నాయుడు అని ఉంది. 'కృతిభర్త' అంటే కావ్యాన్ని అంకితం తీసుకొన్నవాడని అర్థం. మెళ్లో తాళి కట్టిన మొగుడని కాదురా మొద్దూ!" ఈ సారి గారంగానే చెప్పేడు!

కాసేపు నిశ్శబ్దం...

"సారీ నాన్నా...!" అంటూ ఏడ్చేసింది అనిత ఫోనులోనే.